న్యూస్‌రీల్

పార్టీల ప్రచార వ్యయంపై నిఘా



కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: సాధారణ ఎన్నికలు స్వేచ్ఛగా జరగడానికి రాజకీయ పార్టీల ప్రచార వ్యయంపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎన్నికల పర్యవేక్షణ, పరిశీలన అధికారులకు సూచించారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరగడానికి రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎన్నికల నిబంధనలపై కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ అన్ని వ్యవస్థలపైన, ఎన్నికల ప్రచార వ్యయంపైన ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల వారీగా మోహరించిన పరిశీలకుల ద్వారా ఎప్పటికప్పుడు వివరాలు సేకరించి విశ్లేషిస్తారన్నారు. ఎన్నికల పర్యవేక్షణలో పాల్గొంటున్న వివిధ ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ప్రాంతీయ, విభాగ అధిపతులు, నోడల్ ఏజెన్సీల నుంచి వివరాలు తీసుకొని సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. మద్యం, నగదు, ప్రలోభాలకు గురిచేసే బహుమతుల రవాణాను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం వ్యయ పరిశీలకులు అభ్యర్థుల ప్రచార ఖర్చులపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. బ్యాంకులలో పెద్ద పెద్ద డిపాజిట్లు, నగదు ఉపసంహరణ, పోస్టల్ ఆర్డర్లు, ఆన్‌లైన్ పేమెంట్‌లపై నిఘా ఉంచాలన్నారు.


స్వేచ్ఛగా ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

అమలాపురం రూరల్: స్వేచ్ఛాయుత వాతావరణంలో సాధారణ ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు కోరారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో మంగళవారం జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కమీషనింగ్, పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం పోస్టల్ బ్యాలెట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. హోమ్ ఓటింగ్ బృందాలు ఇంటింటికి వెళ్లి పోలింగ్ ప్రక్రియను ప్రారంభించాయన్నారు. జిల్లాలో పనిచేస్తూ జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పించామని చెప్పారు. వేరే జిల్లాల్లో ఓటు హక్కు కలిగి స్థానికంగా పనిచేస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌలభ్యాన్ని అమలాపురం జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాకు సంబంధించి అదనంగా ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఇతర జిల్లాల్లో అభ్యర్థులు ఎక్కువగా పోటీలో ఉన్న చోటకు తరలిస్తామని తెలిపారు. సూపరింటెండెంట్ టి.వైద్యనాథశర్మ, రాజకీయ పార్టీ ప్రతినిధులు దూరి రాజేష్, వడ్డీ నాగేశ్వరరావు, కాశీ లక్ష్మీ భవాని పాల్గొన్నారు.

ఉచిత వేసవి క్రికెట్ కోచింగ్ ప్రారంభం



క్రికెట్ కోచింగ్ క్యాంప్‌కు హాజరైన బాలబాలికలు

యానాం: స్థానిక డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (వైడీసీఏ) ఆధ్వర్యంలో 20 రోజుల పాటు నిర్వహించే ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా కార్యక్రమం బాలయోగి క్రీడా ప్రాంగణంలో మంగళవారం ప్రారంభమైంది. పీఈటీలు పాలికి ప్రకాష్, చింతా వెంకన్న, జల్లి శేఖర్, వరప్రసాద్, భానుకిరణ్ తదితరులు ప్రారంభించిన శిక్షణకు యానాం పరిసర ప్రాంతాలకు చెందిన 7 ఏళ్ల నుంచి 16 ఏళ్ల వయసున్న 72 మంది బాలబాలికలు హాజరయ్యారు. శిక్షణ సమయంలో క్రీడాకారులకు బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా గుడ్లు, పండ్లు ఇస్తామన్నారు. అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రికెటర్ల ఆధ్వర్యంలో ఇస్తున్న ఈ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యానాం క్రికెట్ అసోసియేషన్ సభ్యులు వైజే సత్యం, పి.సుమన్ బాబు, రమేష్‌నాయుడు, కె.సుబ్బారావు, చిట్టి, కె.ప్రసాద్, కె.సత్యనారాయణ, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి వర్ధంతి



చినకొత్తలంకలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: మండలంలోని చినకొత్తలంకలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి నిలువెత్తు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాత్తూరి ఉమారాణి, సొసైటీ అధ్యక్షులు పీటీవీ వర్మ, పి.వీణారాణి, పితాని గోపాలకృష్ణ, పి.వెంకట సుబ్బరాజు, పి.ఉదయ భాస్కరవర్మ, ఎం.గణేష్‌వర్మ పాల్గొన్నారు.

ఆనందరావు సొంతూరులో విశ్వరూప్‌కు బ్రహ్మరథం

- ఎస్.యానం ఎన్నికల ప్రచారంలో జన జాతర
- అడుగడుగునా పూలజల్లులతో మంత్రి విశ్వరూప్‌కు ఘన స్వాగతం



మంత్రి విశ్వరూప్‌కు భారీ గజమాల వేస్తున్న ఎస్.యానం గ్రామస్తులు

ఉప్పలగుప్తం: అమలాపురం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు సొంతూరైన ఉప్పలగుప్తం మండలం ఎస్.యానంలో ప్రజలు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వరూప్‌కు బ్రహ్మరథం పట్టారు. గ్రామ ప్రజలు అడుగడుగునా పూలజల్లులు, మంగళ హారతులు, తీన్‌మార్ వాయిద్యాలతో విశ్వరూప్‌కు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులు మంత్రి విశ్వరూప్‌కు క్రేన్ సాయంతో భారీ గజమాల వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మంగళవారం మంత్రి విశ్వరూప్ ఎస్.యానంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో జన జాతర కనిపించింది. మంత్రి విశ్వరూప్ ప్రచారాన్ని చూసిన వారంతా టీడీపీ అభ్యర్థి ఆనందరావుకు సొంతూరులోనే పట్టు లేకపోతే నియోజకవర్గంలో ఓట్లేం పడతాయంటూ చర్చించుకున్నారు.

విశ్వసనీయతకు మారుపేరు జగన్

ఎన్నికల ప్రచారంలో మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ విశ్వసనీయతకు మారుపేరు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, 420కి ప్రతిరూపం చంద్రబాబు అని అన్నారు. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని 99 శాతం నెరవేర్చిన నాయకుడు సీఎం జగన్ మాత్రమేనన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన 600కి పైగా హామీల్లో 6 హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. ప్రజల సంపూర్ణ మద్దతు వైఎస్ జగన్‌కు ఉందని, మళ్లీ జగన్ సీఎం అవ్వడం ఖాయమన్నారు. భూహక్కు చట్టంపై చంద్రబాబు, ఎల్లోమీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, జగన్ భూములు పంచేవారే తప్ప భూములు లాక్కునేవారు కాదన్న విషయం ప్రజలకు తెలుసన్నారు. స్థానికంగా రవ్వ ప్లాంటు ఉన్నా దాన్నుంచి వచ్చే నిధులను టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఆనందరావు సొంత గ్రామమైన ఎస్.యానం గ్రామాభివృద్ధికి ఉపయోగించకుండా పక్కదోవ పట్టించారన్నారు. తమ పాలనలో జరిగిన అభివృద్ధి గ్రామ ప్రజలందరికీ తెలుసన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మంత్రి విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, డీఎంఆర్ శేఖర్, సర్పంచ్ జోగి రాజేశ్వరి, రామ్మోహన్‌రావు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు పెట్టా అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి దేవరపల్లి గీత, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, బడుగు అబ్బులు, పెట్టా మురళి, లంకే శ్రీను, చిరంజీవి, పొగాకు శ్రీను, అయితాబత్తుల సూరిబాబు, ముత్తాబత్తుల సురేష్, జొన్నాడ మహాలక్ష్మి, రేవు రాజేష్, మూదే దుర్గబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మంత్రి విశ్వరూప్‌కు హారతి ఇస్తున్న మహిళ

జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



మంత్రి పినిపే విశ్వరూప్‌తో రాష్ట్ర గిరిజన నాయకులు

అమలాపురం రూరల్/ముమ్మిడివరం: బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలబడిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని గిరిజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నాయకుడు మద్దెల రామకృష్ణ, యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల రామచంద్రయ్య అన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతు పలుకుతూ చేస్తున్న గిరిజన రాజకీయ చైతన్య యాత్రలో భాగంగా గిరిజన సంఘాల నాయకులు అమలాపురం చేరుకుని మంత్రి విశ్వరూప్‌ను, ముమ్మిడివరంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గిరిజనుల అభివృద్ధికి ఎలా ఉపయోగపడ్డాయో వివరించారు. చంద్రబాబు చెప్పే అబద్ధపు వాగ్దానాలు నమ్మి మోసపోవొద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తోకల చిన్న విరోజి, జగన్నాథం చంటి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



అమలాపురంలో వృద్ధురాలితో ఇంటి వద్దే ఓటు వేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్



అల్లవరంలో హోమ్ ఓటింగ్ నిర్వహిస్తున్న అధికారులు

అమలాపురం టౌన్: పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేయలేని వృద్ధులు, దివ్యాంగులు తమ ఇంటి వద్ద నుంచే ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం ఈ ఎన్నికల నుంచి కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా వెల్లడించారు. అమలాపురం పట్టణం వడ్డిగూడెంలో ఓ వృద్ధుడి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే ప్రక్రియను కలెక్టర్ శుక్లా మంగళవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ 85 సంవత్సరాలు వయసు పైబడిన అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులు, 40 శాతానికి పైబడి వికలాంగత్వం ఉన్న దివ్యాంగులు తమ ఓటు హక్కును ఈ తరహాలో వినియోగించుకునేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిన విషయాన్ని వివరించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 109 హోమ్ ఓటింగ్‌కు అర్హులని తెలిపారు. ఇంటి వద్ద జరిగే ఓటింగ్ విధానాన్ని సిబ్బంది పూర్తిగా వీడియో గ్రఫీ చేశారు. ఓటు హక్కు వినియోగించుకున్నాక బ్యాలెట్ బాక్సులను సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలించారు. పట్టణంలో పలుచోట్ల ఈ ప్రక్రియ జరిగింది. అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, బీఎల్‌వోలు, వార్డు సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా హోమ్ ఓటింగ్

అమలాపురం రూరల్: పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వృద్ధులు, దివ్యాంగుల హోమ్ ఓటింగ్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. 73 బృందాలు, 85 వాహనాలను ఏర్పాటు చేసి హోమ్ ఓటింగ్ నిర్వహించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో మొత్తం 1,251 మంది హోమ్ ఓటింగ్ వేసేందుకు అర్హత సాధించగా వారిలో 729 మంది అంటే 58.55 శాతం ఓటింగ్ నమోదైందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. అమలాపురం పట్టణ పరిధిలోని వడ్డిగూడెంలో హోమ్ ఓటింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. మంగళవారం జరిగిన హోమ్ ఓటింగ్‌లో ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలో 81 మంది, మండపేట నియోజకవర్గంలో 250 మంది, రామచంద్రపురం నియోజకవర్గంలో 61 మంది, పి.గన్నవరం నియోజకవర్గంలో 172 మంది, కొత్తపేట నియోజకవర్గంలో 57 మంది, అమలాపురం నియోజకవర్గంలో 106 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో గత మూడు రోజులుగా జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మంగళవారం సాయంత్రం 6 గంటలతో ముగిసింది. ఎన్నిక విధుల్లో పాల్గొనే వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు మొత్తం 2,398 మంది ఓటర్లుగా ఉన్నారు. గత మూడు రోజుల్లో 98 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

బడుగు బలహీన వర్గాలకు స్వర్ణయుగం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కాట్రేనికోన మండలంలో ఎన్నికల ప్రచారం



వేట్లపాలెంలో ఎమ్మెల్యే పొన్నాడకు ఘన స్వాగతం పలికిన మహిళలు, అభిమానులు

కాట్రేనికోన: పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన బడుగు, బలహీన వర్గాల పాలిట స్వర్ణయుగమని టీటీడీ పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని అడవిపేట, వేట్లపాలెం, జిల్లేళ్లవారిపేట, బూలవారి పేట, రామస్వామి తోట, కాట్రేనికోన తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన పొన్నాడకు ఆయా గ్రామాల మహిళలు, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముందుగా అడవిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిపేట గ్రామంలో గ్రామ సచివాలయ భవనం, హెల్త్ క్లినిక్ సెంటర్లు నిర్మిస్తున్నామని, ఇంటింటికీ కుళాయిల ద్వారా రక్షిత మంచి నీటిని అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్ పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి సొంతింటి కలను నిజం చేశారన్నారు. పంచాయతీ పరిధిలోని దళితవాడల్లో సీసీ రోడ్లు నిర్మించామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అవ్వా, తాతలకు ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛను ఇవ్వాలంటే జగనన్న ప్రభుత్వం రావాలన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించవలసిన బాధ్యత సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులందరిపై ఉందన్నారు. ఫ్యాన్ గాలికి రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల డిపాజిట్లు గల్లంతవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, పాలెపు ధర్మారావు, సానబోయిన నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, సంసాని నాగేశ్వరరావు, పెయ్యల చిట్టిబాబు, ఢిల్లీ నారాయణ, ఉచ్చుల రవికుమార్, కాశి మునికుమారి, దొమ్మేటి రాము, తిరుకోటి శాంతి సుధ, కొప్పాడి బాలకృష్ణ, నాతి సత్యనారాయణ, నల్లా బేబి జానకి, బొడ్డు నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అడవిపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

మండుటెండల నుంచి ఉపశమనం

- వర్షంతో సేద తీరిన ప్రజలు



వర్షంతో అమలాపురంలో మారిన వాతావరణం

అమలాపురం టౌన్: వాతావరణంలో మార్పుల వల్ల నియోజకవర్గంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షం గ్రామీణ ప్రాంతాల్లో కోతలు కోసి కళ్లాల్లో ఉన్న, కోతకు సిద్ధమవుతున్న చేలకు చేటు చేసింది. అయితే వేసవి మండుటెండలతో అవస్థలు పడుతున్న జనం మాత్రం ఈ అకాల వర్షంతో ఉపశమనం పొందారు. ముఖ్యంగా అమలాపురం పట్టణ ప్రజలు వర్షంతో ఊరట చెందారు. వర్షం కారణంగా అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో రైతులు మాత్రం ఆందోళనకు గురవుతున్నారు. ఉదయం నుంచి మండే ఎండలతో సూర్యుడు భగభగమంటే, మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి చిరు చినుకులతో మొదలైన వర్షం కాస్తా భారీ వర్షమై కురిసింది.

చిరుజల్లులతో చల్లబడిన వాతావరణం

యానాం: గత కొద్ది రోజులుగా వేసవి ఉక్కపోతతో అల్లాడుతున్న యానాం పట్టణ వాసులకు వరుణిడి రాక ఉపశమనం కలిగించింది. మంగళవారం మధ్యాహ్నం కురిసిన చిరుజల్లులతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వేసవి తాపం నుంచి ఊరట లభించింది. అనూహ్యంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వాహనచోదకులు, పాదచారులు తడిసి ముద్దయ్యారు.

సంక్షేమ సారథికి పట్టం కట్టండి



శెట్టిబలిజపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరినవారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పితాని బాలకృష్ణ



తూర్పులంకలో నమూనా బ్యాలెట్‌ను చూపుతున్న ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు



అమలాపురం 24వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తనయుడు డాక్టర్ శ్రీకాంత్

- వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం

ఐ.పోలవరం: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేసి సంక్షేమ సారథిగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజుతో కలిసి మండలంలోని ఎదుర్లంక పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. శెట్టిబలిజపాలెంలో పితాని బాలకృష్ణ, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజుల సమక్షంలో 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రమాదవశాత్తు గాయపడి ఇంటివద్దే కోలుకుంటున్న ఎదుర్లంక గ్రామానికి చెందిన రాయవరపు వెంకటేశ్వరరావు, కుడిపూడి శ్రీదేవిలను వారు పరామర్శించారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

అమలాపురం టౌన్: తన తండ్రి, మంత్రి పినిపే విశ్వరూప్ నియోజకర్గంలో గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని ఆయన తనయుడు డాక్టర్ శ్రీకాంత్ ఓటర్లను అభ్యర్థించారు. అమలాపురం పట్టణంలోని 24వ వార్డులో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లో కంచర్ల అయ్యప్ప జ్యూస్ పార్లర్‌లో డాక్టర్ శ్రీకాంత్ స్వయంగా జ్యూస్ తయారు చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి నూలు రమేష్, కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌ను గెలిపించాలి

అమలాపురం రూరల్: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను గెలిపించాలని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం రాత్రి నల్లిమిల్లి గ్రామంలో ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. బందారులంకలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, కామనగరువులో జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, నడిపూడిలో సర్పంచ్ చెల్లుబోయిన నాని ప్రచారం చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించండి

అల్లవరం: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా పినిపే విశ్వరూప్, ఎంపీగా రాపాక వరప్రసాద్‌లను గెలిపించాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు ఓటర్లను కోరారు. మండలంలోని తూర్పులంకలో మంగళవారం ఆయన ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కొమరగిరిపట్నంలో సర్పంచ్ రాపాక విజయలక్ష్మి, తుమ్మలపల్లిలో ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి, దేవగుప్తంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు, కోడూరుపాడులో ఎంపీటీసీ సభ్యుడు గుబ్బల రంగసాధస్వామి, ఎంట్రుకోనలో గ్రామ కమిటీ అధ్యక్షులు వాసర్ల శ్రీను, బెండమూర్లంకలో వైఎస్ ఎంపీపీ ముత్యాల రామకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు పరమట శ్రీను, రైతు విభాగ అధ్యక్షులు కుడుపూడి సూర్యప్రకాష్ తదితరుఉ పాల్గొన్నారు.

మళ్లీ జగనే రావాలి

ముమ్మిడివరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎంపీపీ కోలా గంగా భవానీ పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ఎన్నికల మెనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను, ఎంపీగా రాపాక వరప్రసాదరావులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు, కోలా బాబ్జీ, పీటీవీ వర్మ, పెద్దిరెడ్డి మునీంద్రరావు, నగుబత్తుల రామకృష్ణారావు, ఎస్.సుదర్శన్, పాము శ్రీనివాసరావు, గిరిగి సాయిరామ్, కాశి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



గాడిలంకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు



నల్లమిల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ మండలంలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరపాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరినగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్ తెలిపారు.